క్లుప్తంగా

ఎరువులు, పురుగు మందుల సీజ్



రాజుపాలెం: మండలంలోని గణపవరంలో గల పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. శ్రీ సాంబశివ ఫర్టిలైజర్స్, సాంబశివ ఏజెన్సీలో భౌతిక నిల్వలు, ఈ– పాస్ నిల్వలకు వ్యత్యాసంతో పాటు గ్రౌండ్ నిల్వల్ని స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంతో రూ.1,66,800 విలువ గల 3.675 మెట్రిక్ టన్నుల ఎరువుల్ని సీజ్ చేశారు. 6–ఏ కేసు నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకట నరసయ్యను ఆదేశించారు. కాశీ విశ్వనాథ్ ఫర్టిలైజ్ షాపులో పురుగు మందులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో రూ. 3,19,110 విలువ గల 490 లీటర్ల అమ్మకాల్ని నిలుపుదల చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్. శ్రీనివాసరెడ్డి, విజిలెన్స్ ఏవో వాసంతి పాల్గొన్నారు.

బ్యాంకు గోల్డ్ అప్రైజర్‌పై కేసు నమోదు

క్రోసూరు: దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో తనఖా పెట్టిన బంగారంలో అవతవకలపై ఆ శాఖ నరసరావుపేట రీజినల్ అధికారి చిరుమామిళ్ల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు సోమవారం గోల్డ్ అప్రైజర్ నాగార్జునపై పోలీసులు కేసు నమోదు చేశారు. బ్యాంకులో తనఖా పెట్టిన బంగారం వస్తువులు గోల్‌మాల్ అయ్యాయని ఖాదాదారులు గత ఐదు రోజులుగా ఆందోళన చేస్తుండటంతో ఉన్నతాధికారులు ఇప్పటికే విచారణ చేపట్టారు. దీనిపై మరింత విచారణకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. రీజినల్ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ పాల్ రవీందర్ తెలిపారు.

వైభవంగా మాస శివరాత్రి వేడుకలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడులో గల శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో, గంగా అన్నపూర్ణా సమేత శ్రీమరకతలింగా చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆలయాల్లో సోమవారం మాస శివరాత్రి వేడుకల్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీమహాగణపతి పూజ, మహాన్యాస పారాయణం, రుద్ర, చండీ హోమాలు తదితర పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు. విశేష అలంకరణలో ఉన్న స్వామి, అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

నూర్ బాషా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖాశీం సైదా



పిడుగురాళ్ల: విజయవాడలోని ఆశ పంక్షన్ హాలులో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నూర్ బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ పీరా మహ్మద్ చేతులు మీదుగా పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా దూదేకుల ఖాశీం నియామక పత్రాన్ని అందుకున్నారు. నూర్ బాషా సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా దూదేకుల సలీమ్‌లను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నూర్ బాషా జాతి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. పల్నాడు ప్రాంతంలో ఉన్న నూర్ బాషాలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని తెలియజేశారు. వీరి నియామకంపై పిడుగురాళ్ల మండల అధ్యక్షుడు అంజూ సాహెబ్, తొల్లా సైదా, ఎస్‌బీ టైలర్ సైదా, దూదేకుల బాబు, దూదేకుల ఖాశీం, సయ్యద్ హుస్సేన్, మస్తాన్, రాజుపాలెం మండల అధ్యక్షుడు ఖాశీం సైదా, మాచవరం మండల అధ్యక్షుడు బాజీ, ఖాజా, దస్తగిరి, సైదు బాబు, బాషాలు అభినందనలు తెలియజేశారు.

సీపీఎం నేత శ్రీరాములుకు ఘన నివాళి

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదలలో సీపీఎం నాయకుడు చెరుకూరి శ్రీరాములు 28వ వర్ధంతి సభ ఆదివారం రాత్రి నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ శ్రీరాములు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామంలో సీపీఎం వ్యవస్థాపకుడిగా, ఉప సర్పంచ్‌గా శ్రీరాములు కులమతాలకు అతీతంగా ప్రజలకు అనేక సేవలందించారని తెలిపారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీరాములు స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మార్పుల వెంకటరెడ్డి, చింతపల్లి నాగమల్లేశ్వరరావు, గారాజాలయ్య, ఇందూరి వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరిద్దాం

- త్యాగధనుల స్ఫూర్తిని చాటిచెప్పేందుకే నా భూమి – నా దేశం
- స్వాతంత్ర ఫలాలు దుర్వినియోగం చేయకుండా దేశ అభివృద్ధికి సహకరిద్దాం
- రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు



అమర వీరుల కుటుంబ సభ్యుల సత్కారంలో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: స్వాతంత్ర్యోద్యమంలో బానిస సంకెళ్లు తెంపి, ప్రాణత్యాగం చేసిన త్యాగధనుల స్ఫూర్తిని చాటి చెప్పడమే నా భూమి –నా దేశం ఉద్దేశమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా పట్టణ వాసులతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. అమర వీరులకు జోహార్లు చెబుతూ, భారత్ మాతకు జేజేలు పలుకుతూ భారీసంఖ్యలో ప్రజలు నినదించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో సత్తెనపల్లి నుంచి ఆంధ్ర గాంధీగా పిలబడిన వావిలాల గోపాలకృష్ణయ్య పాల్గొన్నారన్నారు. ఆయన స్ఫూర్తిని కొనసాగిద్దామని తెలిపారు. వావిలాల సాధారణ జీవితం ప్రస్తుత రాజకీయ నాయకులకు సాధ్యం కాదన్నారు. ఆయన జయంతి, వర్ధంతులను వారి మనవడు సోడేకర్‌తో కలసి వైఎస్సార్ సీపీ ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ, త్యాగాల ఫలాల్ని దుర్వినియోగం చేయకుండా .. దేశ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నా భూమి –నా దేశం కార్యక్రమంలో అమరవీరుల్ని స్మరించుకోవడం మన బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వావిలాల గోపాలకృష్ణయ్య అన్న కుమారుడు వావిలాల సత్యం, సైనికులు కర్రిబోయిన సుధాకర్, అమరవీరుడు నేలపల్లి నేతాజీ తల్లిదండ్రులు వీరమ్మ, భాస్కరరావును ఘనంగా సన్మానించారు. వావిలాల ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన అమర వీరులకు వందనం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. నేల తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా 75 మొక్కలు నాటారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, కో–ఆప్షన్ మెంబర్ సహారా మౌలాలి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



వావిలాల విగ్రహం వద్ద భారతమాతకు జేజేలు పలుకుతున్న మంత్రి అంబటి తదితరులు

త్రీఫేజ్‌తో నిరంతర విద్యుత్ సరఫరా



మంత్రి అంబటి , ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు స్వాగతం పలుకుతున్న నేతలు

నకరికల్లు: నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. మండలంలోని దేచవరంలో రూ.2 కోట్లతో ఆధునీకరించనున్న 24గంటల త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూదేచవరం, రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాలకు నిరంతం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నాలుగు నెలల్లో పనులు పూర్తి చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ ఎస్.శ్రీనివాసరావు, డీఈ భవనం వెంకటేశ్వరరెడ్డి, ఏఈ కె.సురేష్, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వజ్రాల వేటకు వచ్చి ప్రమాదాల బారినపడొద్దు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ, తహసీల్దార్

బెల్లంకొండ: వజ్రాల వేట కోసం అటవీ ప్రాంతానికి వచ్చి, ప్రమాదాల బారిన పడొద్దని బెల్లంకొండ ఎస్‌ఐ కె.అమీర్, తహసీల్దార్ ఎన్.దుర్గేశ్వరరావు తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెం అటవీ ప్రాంతంలో సోమవారం వజ్రాల వేటకు వందల సంఖ్యలో జనం వచ్చారు. ఈ సందర్భంగా అక్కడకు ఎస్‌ఐ, తహసీల్దార్ సిబ్బందితో వెళ్లి, కౌన్సెలింగ్ ఇచ్చారు. వజ్రాల వేట చట్టపరంగా నేరమని తెలిపారు. అటవీ ప్రాంతంలో వాటి కోసం వచ్చి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. వజ్రాల వెతుకులాట పేరుతో అటవీ ప్రాంతాలలో చాలా మంది అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గతంలో పలువురు మృత్యువాత పడ్డారని, హత్యలు కూడా జరిగాయని హెచ్చరించారు. మరోసారి వజ్రాల వెతుకులాటకు అటవీ ప్రాంతానికి వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట సిబ్బంది రాజేష్, వెంకటరావు, వీఆర్వో లక్ష్మీనారాయణ ఉన్నారు.

దోషరహిత ఓటర్ల జాబితా తయారీకి కృషి

- సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి
- నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీవో రాజకుమారి

సత్తెనపల్లి: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా దోష రహిత ఓటర్ల జాబితాల రూపకల్పనే లక్ష్యంగా కృషి చేస్తున్నామని సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి చెప్పారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం నియోజక వర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పంలో బీఎల్‌వోల పాత్రే కీలకమని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒకే ఇంటి నంబర్‌లో ఎక్కువ ఓటర్లు నమోదై ఉంటే వారికి నోటీసులు జారీ చేసి తొలగిస్తామని చెప్పారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో మొత్తం 2,30,684 మంది ఓటర్లు ఉండగా 94,359 హౌస్ హోల్డ్స్ ఉన్నాయన్నారు. వీటిలో 1,33,796 మంది ఓటర్లకు చెందిన 54,728 హౌస్ హోల్డ్స్ వెరిఫికేషన్ పూర్తయ్యిందని వెల్లడించారు. ఇప్పటిదాకా 58 శాతం పూర్తయినట్లు చెప్పారు. ఇప్పటివరకు చేసిన వెరిఫికేషన్, మార్పులు, చేర్పులు, తొలగింపులకు చేసిన దరఖాస్తుల వివరాల్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. వారి సందేహాల్ని నివృత్తి చేశారు. సమావేశంలో నియోజకవర్గంలోని సహాయ ఓటు నమోదు అధికారులు ఎస్.సురేష్, ఎం.భవానీశంకర్, ఏ.నళిని, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పెరికపాడు సర్పంచిగా ఊడల శ్రీధర్ ఏకగ్రీవ ఎన్నిక



శ్రీధర్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి చంద్రశేఖరరావు

క్రోసూరు: మండలంలోని పెరికపాడు గ్రామ సర్పంచిగా వైఎస్సార్ సీపీ బలపరిచిన ఊడల శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సోమవారం ఎన్నికల అధికారి ఎస్. ప్రభాకరరావు తెలిపారు. ఈ మేరకు ధ్రువీకరిస్తూ ఆయనకు ఫారం– 10 అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.మహేష్, ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, ఎంపీపీ పి.కోటయ్య, గ్రామ ఉప సర్పంచ్ మస్తాన్‌రావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, పార్టీ నాయకులు చౌదరి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, చిరంజీవి, నర్రా వాసు, షేక్ ఖాదర్, వేజండ్ల రవి, రాము పాల్గొన్నారు.



మెంబర్‌గా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న శ్రీను బండారు

ముగ్గురు వార్డు మెంబర్ల ఎన్నిక ఏకగ్రీవం

సత్తెనపల్లి: మండలంలోని మూడు గ్రామ పంచాయతీలకు ముగ్గురు వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ సోమవారం తెలిపారు. సత్తెనపల్లి మండలం భీమవరం 9వ వార్డు మెంబర్‌గా శ్రీను బండారు, గోరంట్ల ఏడో వార్డు మెంబర్‌గా నందిగామ రవి, లక్ష్మీపురం ఒకటో వార్డు మెంబర్‌గా లావణ్య గోగినేని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఎన్నికైన వార్డు మెంబర్లకు డిక్లరేషన్ పత్రాల్ని అందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ దయాసాగర్, భీమవరం సర్పంచ్ వినినం యోనా, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సర్వేలో పారదర్శకత పాటించాలి

నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎస్. రామచంద్రరావు



క్రోసూరులో సర్వేను పరిశీలిస్తున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి రామచంద్రరావు, అధికారులు

క్రోసూరు: ఇంటింటా ఓటరు జాబితా పరిశీలనను బూత్ లెవల్ అధికారులు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎస్. రామచంద్రరావు చెప్పారు. ఆయన సోమవా రం క్రోసూరు, పీసపాడు గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫారం–6, ఫారం–7,ఫారం –8 విచారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని నియోజకవర్గ ఎన్నికల అధికారి తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ,యువకులకు ఓటుహక్కు కల్పించాలని చెప్పారు. మృతులు, డబుల్ ఎంట్రీ ఓట్లను పాదర్శకంగా విచారణ జరిపి తొలగించాలని ఆదేశించారు. ఓటరు గుర్తింపు కార్డులో మార్పులు, చేర్పులకు ఫారం – 8ను వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సహాయ ఎన్నికల అధికారి, క్రోసూరు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్, బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యార్థులంతా దేశభక్తి పెంపొందించుకోవాలి

జిల్లా అటవీ అధికారి ఎస్. రామచంద్రరావు

క్రోసూరు: విద్యార్థులంతా దేశభక్తి పెంపొందించుకోవాలని పెదకూరపాడు నియోజకవర్గ అధికారి, పల్నాడు జిల్లా అటవీ అధికారి ఎస్. రామచంద్రరావు సూచించారు. దేశం నేడు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండాలని చెప్పారు. క్రోసూరులోని స్ప్రిమ్స్ పాఠశాల, హెల్ప్ ఫౌండేషన్ సంయుక్తంగా అజాదీకా అమృత్ మహోత్సవ్ మేరా దేశ్ మేరా మిట్టీ కార్యక్రమాల్లో భాగంగా 75 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటారు. పాఠశాల డైరెక్టర్లు పద్మావతి, గోవర్ధన్ సారధ్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఫారెస్ట్ అధికారి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరికీ జాతీయ జెండా బలాన్ని, ధైర్యాన్ని చేకూరుస్తుందని తెలిపారు. ఎంఈవో గణేష్ మాట్లాడుతూ మహానీయుల్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. హెల్ప్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ జాతీయ జెండాకు జై కొడదాం, ప్రతి ఇంటా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు బాలఅంకమ్మబాయి, సిరిచందన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



75 మీటర్ల జాతీయజెండాతో విద్యార్థుల ర్యాలీ

కన్నెగండ్లలో వైద్య బృందం పర్యటన

- యశ్వంత్ మృతికి డెంగీ కాదని నిర్ధారణ
- జ్వరంతో బాధపడుతూ కాలేయం, గుండె, కిడ్నీ సమస్యలతో మృతి
- 200 కుటుంబాలలో జ్వరం సర్వే

పెదకూరపాడు: మండలంలోని కన్నెగండ్లలో డెంగీ లక్షణాలతో గోగులపాటి యశ్వంత్ మృతి చెందిన నేపథ్యంలో 75త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుంకర ప్రియాంక ఆదేశాలు మేరకు సత్తెనపల్లి డివిజన్ సబ్ యూనిట్ ఆఫీసర్ సుభాని బేగ్, ఎంపీహెచ్ఈవో విజయకుమార్, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాసరావు, సీహెచ్‌వో ఖలీదా, హెల్త్ అసిస్టెంట్ శిరీష, ఆశ, ఏఎన్ఎంలతో కూడిన బృందం పర్యటించింది. గ్రామంలో 200 ఇళ్లకు వెళ్లి జ్వరాల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాని బేగ్ మాట్లాడుతూ వారం నుంచి యశ్వంత్ జ్వరంతో బాధపడుతున్నారని, వాంతులు, విరేచనాలు అధికం కావడంతో కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.
అక్కడ మూడు రోజుల చికిత్స అనంతరం ఆర్థిక ఇబ్బందులతో శనివారం జీజీహెచ్‌కి వచ్చారన్నారు. అక్కడ వైద్యులు యశ్వంత్‌కు పలు పరీక్షలు నిర్వహించగా జ్వరంతో పాటు గుండె, కాలేయం, కిడ్నీ సమస్యలున్నట్లు గుర్తించి, చికిత్స చేశారని తెలిపారు. డెంగీ లక్షణాలు లేవని నిర్ధారించినట్లు సుభాని బేగ్ పేర్కొన్నారు. గ్రామంలో జ్వరాలు లేవని సర్వేలో తేలిందని తెలిపారు. జ్వరం ఉంటే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని ఆయన గ్రామస్తులకు సూచించారు.



గ్రామంలో జ్వరాల సర్వే నిర్వహిస్తున్న వైద్య బృందం



రాజుపాలెంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

సత్తెనపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె. రవీందర్ రత్నాకర్ చెప్పారు. పట్టణ మలేరియా సబ్ యూనిట్ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోదకాలుపై అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో సచివాలయ హెల్త్ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమన్వయం చేసుకొని ఇంటింటికీ వెళ్లాలన్నారు. ఇంట్లో, బయట నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. దోమల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కూడా తప్పనిసరని తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి పట్టణ మలేరియా అధికారి సీహెచ్. ప్రభాకర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు బి.రోశయ్య, వై.రాజేష్ పాల్, హెల్త్ సెక్రటరీలు ఎంపీ కిరణ్ బాబు, ఎస్ఎం హుస్సేన్, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు తప్పనిసరి

రాజుపాలెం: జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ దోమల వల్ల వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమలు కుట్టకుండా తెరలు వాడాలని, కాచి చల్లార్చుకుని నీటిని తాగాలని సూచించారు. అనంతరం రెడ్డిగూడెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారి వెంకటకృష్ణకుమార్, డాక్టర్ రవితేజనాయక్, సబ్ యూనిట్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు జీవన్ రావు, ఎంఎల్‌హెచ్‌పీ జోత్స్న, ఆరోగ్య కార్యకర్తలు తిరుపతమ్మ, రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ నేత చేరిక



ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో పార్టీలో చేరుతున్న అహమ్మద్

అచ్చంపేట: టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికల పరంపర కొనసాగుతూనే ఉంది. తాజాగా అచ్చంపేట టీడీపీకి చెందిన ముస్లిం నేత షేక్ వజీర్ అహమ్మద్ అనుచరులతో సోమవారం గుంటూరులోని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయానికి తరలి వెళ్లి, వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే శంకరరావు పార్టీ కండవా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి స్వచ్ఛందంగా టీడీపీ కార్యకర్తలు పార్టీలోకి తరలి వస్తున్నారని తెలిపారు. వజీర్ అహమ్మద్ మాట్లాడుతూ జగన్ పాలనలో పార్టీలకు అతీతంగా తమకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, టీడీపీ హయాంలో సొంత పార్టీలో ఉండికూడా ఏ పథకం అందుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మైనార్టీ నాయకులు, అచ్చంపేట ఉప సర్పంచ్ షేక్ జాని, బీరువాల జాని, కమల్ సేవా సంస్థ ప్రతినిధి షేక్ కమల్ సైదా, షేక్ సుభాని, జాన్‌పీరా, నియోజకవర్గ నాయకులు భవిరిశెట్టి హనుమంతరావు, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు పాల్గొన్నారు.

నేడు రెండు చోట్ల ఎమ్మెల్యే జెండా ఆవిష్కరణలు

క్రోసూరు: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో, క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరై జాతీయ జెండాల్ని ఆవిష్కరించనున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

వాహనం అదుపు తప్పి యువకుడికి గాయాలు

నాదెండ్ల: ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో యువకుడికి గాయాలైన సంఘటన గుంటూరు–కర్నూలు రహదారిపై సాతులూరు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు వెంకటప్పయ్య కాలనీకి చెందిన షేక్ షబ్బీర్ ద్విచక్ర వాహనంపై గుంటూరు నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్నాడు. సాతులూరులో స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పింది. దీంతో షేక్ షబ్బీర్ కిందపడటంతో గాయాలపాలయ్యాడు. 108లో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఏపీఎన్‌జీవో మహాసభను జయప్రదం చేయండి

పిడుగురాళ్ల: విజయవాడలో ఈ నెల 21, 22వ తేదీలో జరిగే రాష్ట్ర మహాసభల్ని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ప్రచారాన్ని ఏపీఎన్‌జీవో సంఘం నాయకులు నిర్వహించారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సహాయ వ్యవసాయ సంచాకుల కార్యాలయం, ఏరియా పశువైద్యశాల, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం అధికారులు, ఉద్యోగులను కలిశారు. సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు దామర్ల పట్టాభి, తాలూకా సెక్రటరీ మల్లవరపు ప్రభాకరరావు, జాయింట్ సెక్రటరీలు మన్నవ సాగర్‌బాబు, అబ్దుల్ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

దాచేపల్లి : స్థానిక ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలకు సోమవారం మైక్, స్పీకర్‌ను సోమవారం బహూకరించారు. వారధి ఫౌండేషన్ సభ్యురాలు సీహెచ్. దేవేందర్ కుటుంబ సభ్యులు రూ.10వేలు విలువ చేసే మైక్, స్పీకర్‌ను ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగరం ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అందించారు.

10కే రన్‌లో వినుకొండ విద్యార్థి ప్రతిభ

వినుకొండ(నూజెండ్ల): స్థానిక గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి షేక్ అబ్దుల్లా ఇండిపెండెన్స్ డే సందర్భంగా నిర్వహించిన 10 కె రన్‌లో పాల్గొని ప్రథమ బహుమతి సాధించాడు. హైదరాబాదులోని నెక్లెస్ రోడ్డులో ఈనెల 13వ తేదీన నిర్వహించిన 10 కెరన్‌లో దేశవ్యాప్తంగా అన్నీ రాష్ట్రాలనుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అయితే నిర్దేశిత లక్ష్యాన్ని 23 నిముషాలల్లో ఛేదించి బహుమతి అందుకున్నాడు. త్వరలో విశాఖ పట్టణంలో కిన్లే నాసా ఆధ్వర్యంలో జరిగే 21 కె రన్ పోటీలల్లో పాల్గొననున్నట్లు అబ్దుల్లా తెలిపాడు.